పోస్టులో పంపితే మీ ఖాతాలో జమ

రూ.2వేల నోట్లపై ప్రజలకు ఆర్బీఐ ఆఫర్

న్యూఢిల్లీ, నవంబర్ 2: రూ.2వేల నోట్ల మార్పిడిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రజలకు గొప్ప ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నోట్లున్నవారు వాటిని ఇన్సూర్డ్ పోస్టులో సూచించిన ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాలకు పంపితే అక్కడ మార్చి అంతే విలువైన ఇతర కరెన్సీ నోట్లను వారివారి ఖాతాల్లో తామే జమ చేస్తామని కేంద్ర బ్యాంక్ స్పష్టం చేసింది. అలాగే ట్రిపుల్ లాక్ రిసిప్టాకిల్ (టీఎల్ఆర్) ఫామ్ సౌకర్యాన్నీ కల్పించింది. ఇన్సూర్డ్ పోస్ట్, టీఎల్ఆర్ ఫామ్‌తో అత్యంత భద్రంగా రూ.2వేల నోట్లను ప్రజలు మార్చుకోవచ్చని ఆర్బీఐ రిజినల్ డైరెక్టర్ రోహిత్ పీ దాస్ తెలిపారు. ఆర్బీఐ రీజినల్ ఆఫీసులకు దూరంగా ఉన్నవారి సహాయార్థమే ఈ అవకాశం కల్పించినట్టు చెప్పారు. దీనివల్ల ప్రయాణ సమయం, ఖర్చులు కలిసొస్తాయన్నది. అంతేగాక క్యూలైన్లలో నిలబడే బాధా తప్పుతుందని అన్నారు. ఈ ఏడాది మే 19న రూ.2వేల నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్టు ఆర్బీఐ అనూహ్యంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వీటిని బ్యాంకుల్లో, ఆర్బీఐ కార్యాలయాల్లో మార్చుకునేందుకూ అవకాశం కల్పించింది. తొలుత సెప్టెంబర్ 30దాకా గడువు ఇవ్వగా, ఆ తర్వాత దాన్ని అక్టోబర్ 7 వరకు పొడిగించింది. అక్టోబర్ 8 నుంచి హైదరాబాద్ సహా ఆర్బీఐకి చెందిన 19 ఆఫీసుల్లో మాత్రమే ఈ అవకాశాన్ని ఇచ్చింది. ఈ క్రమంలో ఇప్పుడు ఈ పోస్టల్ సౌకర్యాన్ని తెచ్చింది. ఈసారైతే గడువులేమీ లేవు. 2016 నవంబర్‌లో పాత రూ.500, రూ.1,000 నోట్లను మోదీ సర్కారు రద్దు చేసిన నేపథ్యంలో తొలిసారిగా ఈ రూ.2,000 నోట్లను ఆర్బీఐ పరిచయం చేసిన సంగతి విదితమే.

ఓ ఇనిస్టిట్యూట్ కావాలి

ఆయా రంగాల్లోని రెగ్యులేటర్లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఓ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్లలో ఒకరైన రాజేశ్వర్‌రావు అన్నారు. దీనివల్ల మెరుగైన ఫలితాల్ని సాధించవచ్చని గురువారం ఇక్కడ జరిగిన ఓ సదస్సులో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. ఏయే పరిస్థితుల్లో ఎలా? వ్యవహరించాలన్న దానిపై ఈ ఇనిస్టిట్యూట్ ద్వారా రెగ్యులేటర్లకు మరింత పట్టు లభిస్తుందని చెప్పారు. ఇక డాటా భద్రత విషయంలో ఆర్థిక సంస్థలు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరి వ్యక్తిగత సమాచార గోప్యతను గౌరవించాలని, దాన్ని కాపాడాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందన్నారు.

హైదరాబాద్‌లో లాయిడ్స్

600 మంది టెకీలను నియమించుకోనున్న సంస్థ

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): బ్రిటన్‌కు చెందిన ఆర్థిక సేవల సంస్థ లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూపు తాజాగా హైదరాబాద్‌లో లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్(ఎల్‌టీసీ)ని ప్రారంభించింది. రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీలో ప్రారంభించిన ఈ కార్యాలయం కోసం ఈ ఏడాది చివరినాటికి సంస్థ 600 మంది టెకీలను నియమించుకోనున్నది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ వినియోగదారులకు టెక్నాలజీ ఆధారిత సేవలను అందించేందుకు హైదరాబాద్‌ను గ్లోబల్ సెంటర్‌గా ఎంపిక చేసుకున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి వరకు భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టిన సంస్థ..వచ్చే మూడేండ్ల కాలంలో మరో 3 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నది. ఈ నిధులతో డిజిటల్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు కృత్రిమ మేధస్సు, క్లౌడ్, బ్లాక్‌చెయిన్ ప్రొగ్రాంలను అందించనున్నది. బ్రిటన్‌లో ఉన్న కస్టమర్లకు డాటా, మెచిన్ లెర్నింగ్, క్లౌడ్ ఆధారంగా సేవలు అందించడానికి ఈ నూతన ఆఫీస్‌ను వినియోగించుకోనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

టాటా మోటర్స్ లాభం 3,783 కోట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 2: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్ త్రైమాసికానికి గాను సంస్థ రూ.3,783 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. తన అనుబంధ సంస్థయైన జాగ్వార్ ల్యాండ్ రోవర్ రాణించడం వల్లనే లాభాల్లోకి రాగలిగామని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ సంస్థ లాభాలను ప్రకటించడం విశేషం. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.1,004 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. సమీక్ష కాలంలో కంపెనీ ఆదాయం రూ.79,611 కోట్ల నుంచి రూ.1,05,124 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఏకీకృత విషయానికి వస్తే రూ.1,270 కోట్ల నికర లాభాన్ని గడించింది. గత త్రైమాసికంలో జేఎల్ఆర్ ఆదాయం 6.9 బిలియన్ పౌండ్లు సమకూరింది. గత త్రైమాసికంలో సంస్థ దేశీయంగా 99,300 యూనిట్ల కమర్షియల్ వాహనాలను, 1.39 లక్షల యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది.

హీరో మోటో కార్ప్ లాభం వెయ్యి కోట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 2: ద్విచక్ర వాహన విక్రయాల్లో అగ్రగామి సంస్థయైన హీరో మోటోకార్ప్ అంచనాలకు మించి రాణించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.1,007.04 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం నమోదైన రూ.682.28 కోట్ల కంటే ఇది 47.6 శాతం అధికం. కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.9,158.23 కోట్ల నుంచి రూ.9,533.07 కోట్లకు చేరుకున్నట్టు తెలిపింది. గత త్రైమాసికంలో సంస్థ 14.16 లక్షల మోటార్‌సైకిళ్లను, స్కూటర్లను విక్రయించింది. అలాగే నిర్వహణ ఖర్చులు రూ.8,292.25 కోట్ల నుంచి రూ.8,385.5 కోట్లకు పెరిగాయి. ప్రస్తుత పండుగ సీజన్‌లో వాహనాలకు డిమాండ్ పెరగడం కలిసొచ్చిందని హీరో మోటోకార్ప్ సీఈవో నిరంజన్ గుప్తా తెలిపారు. ఇటీవల కాలంలో మార్కెట్లోకి విడుదల చేసిన ప్రీమియం ఉత్పత్తులకు కూడా కస్టమర్ల నుంచి విశేష స్పందన లభిస్తున్నదన్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు దేశీయ ఆటోమొబైల్ రంగంపై స్వల్పంగా ప్రభావం చూపనున్నాయని చెప్పారు.

దాతృత్వంలో పెద్ద మనసు

రోజుకు 5.6 కోట్లు దానం చేసిన శివ్ నాడార్

2022-23లో రూ.2,042 కోట్ల విరాళాలు

ఎడెల్‌గీవ్ హురున్ ఇండియా దాతల తాజా జాబితా

రెండో స్థానంలో విప్రో అధినేత ప్రేమ్‌జీ

న్యూఢిల్లీ, నవంబర్ 2: వ్యాపార, పారిశ్రామిక రంగాల్లోనే కాదు.. దాతృత్వంలోనూ తమ పెద్దరికాన్ని చాటుతున్నారు హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్, ఆయన కుటుంబ సభ్యులు. గత ఆర్థిక సంవత్సరం (2022-23) రోజుకు రూ.5.6 కోట్ల చొప్పున విరాళాలు ఇచ్చినట్టు తేలింది. ఈ మార్చి ఆఖరుతో ముగిసిన ఏడాదికిగాను ఎడెల్‌గీవ్ హురున్ ఇండియా ఫిలంత్రఫీ జాబితా-2023 గురువారం విడుదలైంది. ఇందులో శివ్ నాడార్, ఆయన కుటుంబం అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నది. మొత్తం రూ.2,042 కోట్ల విరాళాలిచ్చారు. శివ్ నాడార్ ఒక్కరే రూ.1,899 కోట్లు దానం చేశారు. ఇక ఇది 10వ జాబితా అవగా.. గత ఐదు వార్షిక జాబితాల్లో నాడార్, ఆయన కుటుంబమే మూడుసార్లు ప్రథమ స్థానంలో ఉండటం గమనార్హం. కాగా, ఆర్ట్స్, కల్చర్, హెరిటేజ్ రంగాలకు శివ్ నాడార్, ఆయన కుటుంబం నుంచి విరాళాలు వెళ్లాయి. అంతేగాక 2021-22తో పోల్చితే ఈసారి 76 శాతం పెరగడం విశేషం.

ప్రేమ్‌జీ రూ.1,774 కోట్లు

విప్రో అధిపతి అజీమ్ ప్రేమ్‌జీ, ఆయన కుటుంబం గత ఆర్థిక సంవత్సరం రూ.1,774 కోట్ల విరాళాలిచ్చింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఏకంగా 267 శాతం పెరగడం గమనార్హం. ఇందులో అజీమ్ ప్రేమ్‌జీ వాటానే రూ.1,638 కోట్లున్నది. విద్యా కోసం ఈ విరాళాలు వెళ్లాయని ఎడెల్‌గీవ్ హురున్ వెల్లడించింది. ఇదిలావుంటే దేశంలోనే అత్యంత సంపన్నుడైన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, ఆయన కుటుంబ సభ్యులు రూ.376 కోట్ల విరాళాలే ఇచ్చారు. పైగా నిరుడుతో పోల్చితే 8 శాతం తగ్గడం గమనించదగ్గ అంశం. ఆరోగ్య సంరక్షణకు ఈ విరాళాలు వెళ్లాయి. ఇక మొన్నటిదాకా భారతీయ అపర కుబేరుడిగా ఉండి, హిండెన్‌బర్గ్ దెబ్బకు కుదేలైన అదానీ గ్రూప్ సారథి గౌతమ్ అదానీ విరాళాలు రూ.285 కోట్లుగా ఉన్నాయి. ఎక్కువమంది విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం విరాళాలిచ్చారు. ఇక నందన్ నిలేకని, ఆయన భార్య రోహిణి నిలేకని కలిసి రూ.359 కోట్ల విరాళాలిచ్చారు. టాప్-10లో పేరున్న ఏకైక మహిళ సైతం రోహిణి నిలేకనే.

- ఈ ఏడాది జాబితాలోకి కొత్తగా 25 మంది రాక. మొత్తం ఏడుగురు మహిళలకు స్థానం. లిస్టులో ముంబైకి చెందినవారే అధికం. ఆ తర్వాతి స్థానాల్లో న్యూఢిల్లీ, బెంగళూరు వాసులు.
- గత ఆర్థిక సంవత్సరం రూ.5 కోట్లకుపైగా విరాళాలిచ్చినవారు 119 మంది. నిరుడుతో పోల్చితే పెరిగిన 11 మంది. వీరందరి విరాళాల విలువ రూ.8,445 కోట్లు. గత ఏడాదితో చూస్తే 59 శాతం అధికం.

టాప్-10 దాతల వివరాలు (రూ.కోట్లలో)

సంఖ్య	పేరు	విరాళం	సంస్థ
1.	శివ్ నాడార్&కుటుంబం	2,042	హెచ్‌సీఎల్‌టెక్
2.	అజీమ్ ప్రేమ్‌జీ&కుటుంబం	1,774	విప్రో
3.	ముకేశ్ అంబానీ&కుటుంబం	376	రిలయన్స్ ఇండస్ట్రీస్
4.	కుమార్ బిర్లా&కుటుంబం	287	ఆదిత్యా బిర్లా
5.	గౌతమ్ అదానీ&కుటుంబం	285	అదానీ గ్రూప్
6.	బజాజ్ కుటుంబం	264	బజాజ్
7.	అనిల్ అగర్వాల్&కుటుంబం	241	వేదాంత
8.	నందన్ నిలేకని	189	ఇన్ఫోసిస్
9.	సైరస్&అదార్ పూనవాలా	179	సీరమ్ ఇనిస్టిట్యూట్
10.	రోహిణి నిలేకని	170	ఫిలంత్రోఫీస్

- లిస్టులో ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుల్లో నలుగురు. మొత్తం రూ.364 కోట్లు దానం. నందన్ నిలేకని రూ.189 కోట్లు, క్రిస్ గోపాలకృష్ణన్ రూ.93 కోట్లు, కే దినేశ్ రూ.47 కోట్లు, శిబూలాల్ రూ.35 కోట్లు చొప్పున ఇచ్చారు.
- టాప్-10లో ఉన్నవారి విరాళాలు రూ.5,086 కోట్లు. నిరుడు రూ.3,034 కోట్లే.
- గడిచిన ఐదేండ్లలో రూ.100 కోట్లకుపైగా విరాళాలు ఇస్తున్నవారి సంఖ్య 2 నుంచి 14కు పెరుగుదల. రూ.50 కోట్లకుపైగా విరాళాలిచ్చినవారి సంఖ్య 5 నుంచి 24కు చేరిక.
- 37 ఏండ్ల జెరోధా సహవ్యవస్థాపకుడు నిఖిల్ కామత్.. జాబితాలో అందరికంటే చిన్నవాడు. తన సోదరుడు నితిన్ కామత్‌తో కలిసి రూ.110 కోట్లు విరాళం.

నయా డిజిటల్ స్టోర్ అజియోగ్రామ్

ఫ్యాషన్ స్టార్టప్‌లే లక్ష్యంగా ప్రకటించిన అజియో

బెంగళూరు, నవంబర్ 2: దేశీయ ప్రీమియర్ లైఫ్‌స్టైల్ కంపెనీ, రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన ఫ్యాషన్ ఈ-కామర్స్ సంస్థ అజియో.. డీ2సీ ఆధారిత ఈ-కామర్స్ వేదిక అజియోగ్రామ్‌ను గురువారం ప్రకటించింది. భారతీయ ఫ్యాషన్ స్టార్టప్స్ సాధికారత లక్ష్యంగా ఈ డిజిటల్ స్టోర్‌ను పరిచయం చేస్తున్నట్టు అజియో ఓ ప్రకటనలో తెలియజేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో తమ సరికొత్త ఉత్పత్తులను విక్రయించుకోవడానికి ఫ్యాషన్ స్టార్టప్‌లు నానా ఇబ్బందులు పడుతున్నాయని అజియో సీఈవో వినీత్ నాయర్ అన్నారు. వాటన్నిటికీ తమ అజియోగ్రామ్ ఓ చక్కని వేదిక కాగలదన్న విశ్వాసాన్ని ఈ సందర్భంగా ఆయన వ్యక్తం చేశారు. ఇక అజియో యాప్ నుంచి అజియోగ్రామ్‌కు కస్టమర్లు అనుమతిని పొందవచ్చన్న ఆయన.. వచ్చే ఏడాది కల్లా 200 ఎక్స్‌క్లూజివ్ ఇండియన్ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ డీ2సీ (డైరెక్ట్ టు కస్టమర్) బ్రాండ్లను అజియోగ్రామ్ వేదికపైకి తేవాలనుకుంటున్నట్టు తెలిపారు. స్త్రీ, పురుషుల దుస్తులు, పాదరక్షలు, ఇతరత్రా యాక్సెసరీస్ బ్రాండ్లన్నీ అజియోగ్రామ్ ప్లాట్‌ఫామ్‌పై ఉంటాయన్నారు. అర్బన్ మంకీ, సూపర్‌వేక్, క్విర్క్ స్మిత్, కేఆర్ఏ లైఫ్ వంటి బ్రాండ్ల ఉత్పత్తులు అజియోగ్రామ్‌పై మాత్రమే లభిస్తాయన్నారు.

బెంజ్ సరికొత్త మాడళ్లు

గరిష్ఠ ధర రూ.1.15 కోట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 2: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల సంస్థ మెర్సిడెజ్ బెంజ్ మరో రెండు మాడళ్లను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. వీటిలో నూతన ఎస్‌యూవీ జీఎల్‌ఈ రూ.96.4 లక్షల నుంచి రూ.1.15 కోట్లలో లభించనుండగా, రూ.98 లక్షల ప్రారంభ ధరతో ఏఎంజీ సీ 43 మాడల్ లభించనున్నది. కేవలం 4.6 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. వీటిలో జీఎల్‌ఈ మాడల్‌పై రెండేండ్ల సర్వీస్ ప్యాకేజ్ ధర రూ.85 వేలు, ఏఎంజీ సీ 43 మూడేండ్ల సర్వీస్ ప్యాకేజి కోసం రూ.1.5 లక్షల చార్జీ వసూలు చేస్తున్నది. ప్రస్తుత సంవత్సరంలో దేశీయ మార్కెట్లోకి 10 మాడళ్లను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ ఈ లక్ష్యాన్ని పూర్తి చేసుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యార్ మాట్లాడుతూ..సరఫరా ఆందోళనలు ఉన్నప్పటికీ వచ్చే ఏడాది రికార్డు స్థాయి విక్రయాలు సాధిస్తామన్న ధీమాను వ్యక్తంచేశారు. దేశీయంగా లగ్జరీ కార్లకు డిమాండ్ అంతకంతకు పెరుగుతున్నదని, ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 12,768 యూనిట్ల వాహనాలను విక్రయించినట్లు చెప్పారు. 2022లో అమ్ముడైన 15,822 యూనిట్ల కంటే ఈ ఏడాది రికార్డు వాహనాలను విక్రయించేదానిపై ఆయన గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేశారు. ఈవీలపై ఆయన స్పందిస్తూ మొత్తం వాహనాల్లో 4-5 శాతం వీటి వాటా ఉంటుందన్నారు.

అదానీ గూటికి క్వింట్ మీడియా

100 శాతం వాటా కైవసం చేసుకున్న సంస్థ

న్యూఢిల్లీ, నవంబర్ 2: ప్రధాని నరేంద్ర మోదీ సన్నిహితుడిగా పేరొందిన గౌతమ్ అదానీ మీడియా రంగంలోకి శరవేగంగా విస్తరిస్తున్నారు. ఇప్పటికే ఎన్డీటీవీని టేకోవర్ చేసిన అదానీ గ్రూప్ తాజాగా డిజిటల్ బిజినెస్ న్యూస్ ప్లాట్‌ఫామ్ బీక్యూ ప్రైమ్ (గతంలో బ్లూంబర్గ్‌క్వింట్)ను పూర్తిగా అధీనంలోకి తెచ్చుకున్నారు. బీక్యూ ప్రైమ్‌ను నిర్వహించే క్వింటిల్లిన్ బిజినెస్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో (క్యూబీఎంఎల్) మిగిలిన 51 శాతం వాటాను సొంతం చేసుకున్నారు. ఇదే గ్రూప్ 2022 మార్చిలో 49 శాతం క్వింట్ వాటాను కొనుగోలు చేసింది. వాస్తవానికి ఈ కొనుగోలు తర్వాతే ఎన్డీటీవీలో మెజారిటీ వాటాను చేజిక్కించుకుంది. క్యూబీఎంఎల్‌లో 51 శాతం వాటా కోసం తమ సబ్సిడరీ ఏఎంజీ మీడియా నెట్‌వర్క్స్ షేర్ పర్చేజ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసినట్టు అదానీ ఎంటర్‌ప్రైజెస్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. లావాదేవీ విలువను వెల్లడించలేదు. గతంలో రూ.47.84 కోట్లకు 49 శాతం వాటాను కొన్నది. ప్రస్తుతం సంస్థను పూర్తి అధీనంలోకి తెచ్చుకునేందుకు మెజారిటీ వాటా కొన్నందున, ఈ లావాదేవీ విలువ అధికంగా ఉంటుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. జర్నలిస్ట్, వాణిజ్యవేత్త రాఘవ్ బెహల్ ప్రమోట్ చేసిన క్వింటిల్లిన్ మీడియా యూఎస్‌కు చెందిన ఫైనాన్షియల్ న్యూస్ ఏజెన్సీ బ్లూంబర్గ్‌తో కలసి జాయింట్ వెంచర్‌గా బ్లూంబర్గ్ క్వింట్‌ను నడిపారు. గత ఏడాది మార్చిలో ఈ వెంచర్ నుంచి బ్లూంబర్గ్ వైదొలిగింది. బిజినెస్ న్యూస్ చానల్ సీఎన్‌బీసీ టీవీ 18 రాఘవ్ బెహల్ నేతృత్వంలోని నెట్‌వర్క్ 18 గ్రూప్ నెలకొల్పింది. ఈ గ్రూప్‌ను రిలయన్స్‌కు విక్రయించారు. అటుతర్వాత బ్లూంబర్గ్ క్వింట్‌ను ప్రారంభించారు.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రాఫిట్ డౌన్

న్యూఢిల్లీ, నవంబర్ 2: దేశీయ కుబేరుల్లో ఒకరైన గౌతమ్ అదానీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు చెందిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను కంపెనీ నికర లాభం 50.57 శాతం తగ్గి రూ.227.82 కోట్లకు పడిపోయింది. ఏడాది క్రితం ఇది రూ.460.94 కోట్లుగా ఉన్నది. గత త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం 41 శాతం తగ్గి రూ.38,175.23 కోట్ల నుంచి రూ.22,517.33 కోట్లకు పడిపోయింది. ప్రస్తుతం సంస్థ వద్ద రూ.1,242 కోట్ల నగదు నిల్వలున్నాయి.

మార్కెట్లకు ఫెడ్ కిక్కు

490 పాయింట్లు ఎగబాకిన సూచీ

ముంబై, నవంబర్ 2: స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ తీసుకున్న నిర్ణయంతో అంతర్జాతీయ మార్కెట్లు దౌడ్ తీశాయి. దీంతో వరుసగా రెండు రోజులుగా తగ్గుతూ వచ్చిన దేశీయ సూచీలు భారీగా లాభపడ్డాయి. ఇంట్రాడేలో 600 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ తిరిగి 64 వేల పాయింట్ల పైకి చేరుకున్నది. చివరకు 489.57 పాయింట్లు లాభపడి 64,080.90 వద్ద ముగిసింది. అటు మరో సూచీ నిఫ్టీ కూడా 144.10 పాయింట్లు అందుకొని 19,133.25 వద్ద ముగిసింది. గత రెండు సెషన్లలో సెన్సెక్స్ 521 పాయింట్లు, నిఫ్టీ 152 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే. ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడంతో పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్‌ను మెరుగుపరిచిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. అమెరికా బాండ్ ఈల్డ్ భారీగా పడిపోవడం కూడా మార్కెట్లకు ఉత్సాహాన్నిచ్చాయి. జీఎస్టీ వసూళ్లు పుంజుకోవడం, కీలక రంగాలు ఆశాజనకంగా ఉండటమూ కలిసొచ్చాయి.

- ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు టాటా మోటర్స్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్‌గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, ఎన్‌టీపీసీ, నెస్లె, ఎస్బీఐ, రిలయన్స్‌లు ఒక్క శాతానికి పైగా పెరిగాయి.
- వీటితోపాటు అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, ఎల్ అండ్‌టీ, టీసీఎస్, మారుతి, కొటక్ బ్యాంక్, విప్రో, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు పెరిగాయి.
- బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రాలు మాత్రం నష్టపోయాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.20 శాతం, స్మాల్ క్యాప్ 0.97 శాతం సూచీలు కదంతొక్కాయి.
- రంగాలవారీగా చూస్తే రియల్టీ 2.55 శాతం, టెలికమ్యూనికేషన్స్ 2.42 శాతం, మెటల్ 1.68 శాతం, పవర్ 1.60 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.15 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ 1.13 శాతం, కమోడిటీస్ 1.10 శాతం చొప్పున పెరిగాయి.

జ్యూరిచ్ చేతికి కొటక్ ఇన్సూరెన్స్

రూ.4,050 కోట్లతో మెజారిటీ వాటా కొనుగోలు

ముంబై, నవంబర్ 2: కొటక్ మహీంద్రా బ్యాంక్ తన జనరల్ ఇన్సూరెన్స్ వ్యాపారంలో 51 శాతం వాటాను విక్రయించనుంది. కొటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో మెజారిటీ వాటాను రూ.5,051 కోట్లకు స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిచ్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయనున్నట్టు కొటక్ బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు గురువారం తెలిపింది. ఈ వాటా కొనుగోలు పూర్తయిన మూడేండ్లలోపు మరో 19 శాతం వాటాను స్విస్ సంస్థ కొంటుందని బ్యాంక్ వివరించింది. దేశీయ జీవితేతర బీమా పరిశ్రమలో సెప్టెంబర్ చివరినాటికి కొటక్ జనరల్ ఇన్సూరెన్స్‌కు 0.52 శాతం వాటా ఉన్నది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ స్థూల ప్రీమియం ఆదాయం రూ.1,148 కోట్లు. కొటక జనరల్‌కు రూ.7,943 కోట్ల విలువ కడుతూ ప్రస్తుత వాటా విక్రయం జరుగుతున్నది.

ఆటోకు పండుగ కళ

అక్టోబర్‌లో రికార్డుస్థాయి అమ్మకాలు

అక్టోబర్‌లో దేశీయ వాహన విక్రయాలు

సంస్థ	2023	2022	వృద్ధి
మారుతీ సుజుకీ	1,77,266	1,47,072	21%
హ్యుందాయ్	55,128	48,001	15%
టాటా మోటర్స్	48,337	45,217	7%
మహీంద్రా	43,708	32,226	36%
టయోట	21,879	13,143	66%
కియా ఇండియా	24,351	23,323	4.4%
ఎంజీ మోటర్	5,108	—	17%
హీరో మోటోకార్ప్	5,74,930	4,54,582	26.5%
హోండా ఎంఎస్ఐ	4,92,884	—	10%
బజాజ్ ఆటో	4,71,188	3,95,238	19%
సుజుకీ మోటర్‌సైకిల్	1,00,507	84,302	14,4%
రాయల్ ఎన్‌ఫీల్డ్	84,435	82,235	2.68%

న్యూఢిల్లీ, నవంబర్ 2: దేశీయ ఆటో రంగానికి పండుగ కళ వచ్చింది. మార్కెట్‌లో పెద్ద ఎత్తున డిమాండ్ నేపథ్యంలో ఆయా కంపెనీల వాహనాలు గత నెల భారీగా అమ్ముడైపోయాయి. తాజా గణాంకాల ప్రకారం అక్టోబర్‌లో మొత్తం ప్యాసింజర్ వాహన విక్రయాలు 3,91,472గా ఉన్నాయి. నిరుడు ఇదే నెల 3,36,679గానే ఉండగా.. 16 శాతం వృద్ధి కనిపించింది. మారుతీ సుజుకీ సేల్స్ 21 శాతం పెరిగాయి. హ్యుందాయ్, టాటా, మహీంద్రా అండ్ మహీంద్రా, టయోట అమ్మకాలూ ఆకట్టుకున్నాయి. ద్విచక్ర వాహన అమ్మకాలూ జోరుగా సాగాయి. హీరోమోటోకార్ప్ ఏకంగా 26.5 శాతం వృద్ధిని అందుకున్నది. హోండా, బజాజ్, సుజుకి మోటర్ సైకిల్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు ఆకర్షణీయంగా నమోదయ్యాయి. వాణిజ్య వాహనాలకూ గిరాకీ కనిపించింది.